
# మధ్యతరగతి

# అంతరంగం



జి.వెంకటకృష్ణ

**అ**రె.... రాజ్‌విహార్ సెంటర్, అప్పుడే కర్నూల్‌కి వచ్చిందా బస్, అరే బస్సు కదుల్తోందే...... నేను దిగాల్నే....

"క క్...ండెక్టర్... నేన్నిగాలి.... ఆపండి...." నిద్రగొంతు నాకే కొత్తగా వుందే.

"ఎంతసేపు ఆపాలండీ మరిచిపోయి నిద్రపోతే ఎట్లా తొందరగా దిగండి" ఎంతసేపు నిద్రపోయినా నబ్బా.... టైమెంతైందో అరే మూడూ నలభైయైదు అయ్యిందే.... ఓహో బస్సుకు పంచరు కదూ రాత్రి గుత్తి దగ్గర.... రిపేరీ పర్వంతో లేటయ్యింది.

రాజ్ విహార్ సెంటర్‌కు గవర్నమెంటు ముస్తాబు.... టూరిజమ్ డాబు... మెరిసిపోతుందే....

"ఆ...హా.....హా...." వొళ్ళు విరుచుకుంటే ఎంత హాయి!

"సార్,సార్..ఆటో...."

"వస్తారా సార్....."

"సా..... సా..... రిక్షా యెక్కండి సా...."

ఇంతరాత్రి వరకూ మేల్కొని కాచుకొక్కాచున్నారంటే..... ప్చ్.... పాపం కష్టజీవులు, బతుకు బండి లాగ డానికి తప్పదేమో మరి.

నగరాలు రాత్రిళ్ళూ నిద్రపోవు... మనిషి అవసరాలు నిద్రపోతే కదా....

"ఆటో....."

"ఎక్కడికి సార్"

"C - కాంపు సెంటర్"

"యెక్కండి సార్"

"యెంత యివ్వాలి"

"పదహైదు రూపాయి లివ్వండి సార్"

"పదహైదు ! యెందుకివ్వాలి.... మామూలుగా వుదయమైతే మూడ్రూపాయలేనే... నీకెందుకియ్యాలా పదహైదు... యేం బాకీనా.... నీకు.

"ఏందయ్యా అంతడుగుతున్నావ్, ఎనిమిదిస్తారా.... మధ్యలో యింకా యెవరైనా యెక్కుతార్లే....."

"యియ్యాల కాడ మధ్యలో యెవురెక్కరు సార్ అట్నుంచీ వెనక్కొచ్చేకీ బేరముండదు....."

"పోనీ పదిస్తారా"

"పన్నెండుకు తక్కువుకు రాన్సార్"

చాలా ఆశపోతులా గున్నాడే.....

"రాండి సార్ రిక్షాలో పోదాం" ఎదురుగా ఖాకీ అంగీ నీలం నిక్కర్ మనిషి గోతి కాడ గుంట నక్క...తప్పు... తప్పు... కడుపాత్రం.... తప్పదు.

"ఎంతివ్వమంటావయ్యా"

"పదియ్యండి సార్"

"ఏమిటి నువ్వూ పది అడుగుతావా?"

"యింతపొద్దున్న బేరం యేముంది సార్....మీదే బోణీ సార్"

"ఆరిస్తా"

"సరే యెక్కండి సార్"

తొందరపడుతున్నావ్... యింకాస్పేపు ఆగితే మేలేమో.... బస్టాండు నుంచీ ఆటోలు, C- క్యాంపు పోయేవి రావచ్చు....

"రండి సార్"

ఎక్కక తప్పదా.... బస్టాండు నుండీ C - క్యాంపు వెళ్ళే ఆటోలు ఎప్పుడొస్తాయో యేమో? చలిగాలి... ఎదురు చూడ్డం కష్టం.... పోనీ రిక్షావాణ్ణి బతికిద్దాంలే...బోణీ చేద్దాం....

"సరే పదవయ్యా"

నగరం నిశ్శబ్దంగానే మేల్కొంటోంది.. అబ్బా చలిగాలి... మొహానికి కొడ్తా వుంది.... భరించలేను... అరే ..... రిక్షాఆయనా నువ్వేమో తలకు మఫ్లర్ చుట్టుకుంటువి... నీ రిక్షా యెక్కినందుకు చలికి చావాలి నేను....

"బ్ర్ర్ర్......"

అరే....ఆటో పోతాందే...... C - క్యాంపు వైపేనే... రాజవిహార్ సెంటర్లోనే వుండుంటే, యీ ఆటోలో పోయుండేవాడ్ని.... యెంత ఆత్రపడితిని.... అంతా హేస్టీ నే.... ఛా...ఛా.... ఐదు నిమిషాలు వెయిట్ చేసుంటే బాగుండు....ఆటోలో పోతూంటి.... ఆటోవాడు కాస్తా ముందైనా రాకపాయ.....యీ రిక్షావాడొకడు... వీడికి బుక్ అయిపోతిని.... అబ్బా యేందీ రిక్షా శబ్దం.... డిక్... డిక్.... డిక్.... డిక్....ఫ్చ ఆటో వెళ్ళిపాయ...యిట్లా మధ్యలో యెక్కితే మూడ్రూ పాయలే..... చలిగాలి.... డిక్ డిక్....డిక్ డిక్.... అబ్బా.... అక్కడికీ కొంతసేపు చూస్తిమి...వెయిట్ చేయడం బోర్....చలొకటి... భరించ లేం.... నీలం నిక్కర్ వెంటబడా డిక్ డిక్మని.... ఎక్కేస్తిమి.... సరే వీళ్ళూ బతకనీ...బీదోల్లు గదా....ఆ....పెద్ద వుద్ధారకుడంటే.... మనమూ బతకాల గదా.... మూడ్రూపాయల్తో పోయే దానికి వీడికి ఆరివ్వాలి... చలిగాలికి ముందే ఎలర్జీ.... మందులకి పెట్టాలి..... వేస్ట్..... డబ్బులు వేస్ట్.... ఎంత టైం వేస్ట్..... ఆటోల యుగంలో రిక్షాలెందుకున్నాయో ఏమో... ఏమోయ్ సీతారామారావ్... విమానాలొస్తే ఎద్దులబండ్లు మాయమైనాయా.... రిక్షాలూ బతకొద్దూ?... నువ్వు కాకుంటే గోపీచంద్ రామయ్యతాత యెక్కుతాడు రిక్షా.... మార్క్సును ఏకుతాడు....ఆధ్యాత్మిక వాదమా.... కాదు.... కాదు....వొద్దొద్దొ భౌతికవాదమే.... బోణీచేసాం... భుక్తీ...శక్తీ యిచ్చాం.... ఓహొహో.... అన్నీ మార్క్సు మాటలే... మళ్ళీ మూడ్రూపాయలకే యేడుపులూ..... అరెరే.... యింకో ఆటో పోతూందే....

"బ్ర్ర్ర్....."

రెండు ఆటోలు వెళ్లిపాయ..... మొదటి ఆటో యివ్వాల్టికి C - క్యాంపు సెంటర్లో వుంటుంది...... కొద్ది సేపు వెయిట్ చేసుంటే బాగుండు... హేస్టీగా రిక్షావాడితో బేరమాడి...మొహమాటంతో ఎక్కేసి.... ఎంత యిబ్బంది....బుద్ధి తెచ్చుకో..... ఎప్పుడూ హేస్టీనే....యీ హేస్టీతోనే జీవితంలో ఎన్ని పోగొట్టుకున్నావో...ఆత్రగాడికి బుద్ధి మట్టం.....

అబ్బబ్బాబ్బా....సరేలే స్వామీ చంపుతున్నావే.... వోపిక పట్టు.... వెళ్ళిపోతాము... ఎక్కేసాము కదా.....యిక దిగలేము.... వెళ్లాల్సిందే...... సతమతమయ్యేదెందుకు..... రేప్ కూడా అనివార్యమైతే అందులో ఆనందాన్ని అనుభవించాలంటాడు యేదో నవల్లో యండమూరి తెల్సా.... అబ్బో.... యింత రాత్రివేళ గుర్తొచ్చిందే..... పక్కా కమర్షియల్. నవల....యీ చలికీ.... ఈ చుట్టూ చీకటికి.... డిక్ డిక్..... డిక్ డిక్.... చప్పుడుకీ కాష్మోరా గుర్తుకురావాలి.... అట్లాంటావేం యండమూరిని ఎంతైనా రైటర్కదా.... రైటరా..... రైట్ రైటరు కాదు కదా.... రైటరంటే యేదో రూపంలో బీదవాళ్ళ సపోర్టర్.... యీ నీలం నిక్కర్ డిక్ డిక్.... డిక్డిక్కి యీ రోజు మనం బోణీ చేస్తున్నాం.... ఒక మూడ్రూపాయలు ఎక్కువిస్తున్నాం... అంతే కదా.... అస్సలు ఆటో దొరకలేదనుకుందాంలే.... అవును.... అనుకుందాంలే.... అసత్యాన్ని సత్యంగా భావించి చివరకు నిర్ధారించుకుందాంలే..... కీలుబొమ్మలు నవల్లో సుబ్బయ్యలా..... లేయ్..... అలా చూడు..చూడూ...నీలం నిక్కర్ డిక్డిక్... డిక్ డిక్...బీడీ అంటించాడు... గుప్పు.... గుప్పున..... సిగరెట్ స్మోకింగ్ యీజ్ యిన్ జ్యూరియస్ టు హెల్త్... బట్ నాట్ బీడీ స్మోకింగ్.... అందుకే బీడీమీద రాసుండదు కదా... అరెరే... రిక్షావాడు మిట్ట ఎక్కలేక పోతున్నాడే.... తొయ్యోయ్... తొయ్యోయ్... తొయ్.... మొయ్యోయ్....మొయ్యోయ్.... మొయ్.... దిగుదామా... త్వమేవాహమా...

నువ్ నోర్ ముయ్... డబ్బులెక్కువ యిచ్చేది కాక... టైమ్ వేస్ట్ చేసింది కాక... యీ చలికి సంపుతుండేది కాక.... మళ్లీ దిగి అక్కడదాకా నడవాల్నా....... తొయ్యనీలే... ఆటోలో పోయుంటే యివ్వాల్టికి యింట్లో హాయిగా..... ఆహాహా....... మార్నింగ్బ్రేక్ఫాస్టలండీ... రిక్షావాడు అలసిపోయి తొయ్యలేకపోతూంటే.... నీ సుఖాన్ని చూసుకోవడం...ఛండాలంగా..... పాపం రిక్షావాడు... త్వరగా రా దిగుదాం.... రేయ్ నీ నోరు నొక్కేయాల్రా.... సుఖపడనీవు.... నాకు దాపురించావు... అంతరాత్ముడా

విననంటే వినను.......యిదిగో చెప్పేస్తున్నా....

"రి....రి..... రిక్షా దిగుతానుండు నాయనా తొయ్యలేక పోతున్నావ్".

"ఫర్వాలేదులే సార్.... యీ కొంచెమే గదా.... తోస్తాను".

"వొద్దులేవయ్యా హాస్పిటల్ మిట్ట దాటేంత దాకా నడుస్తాలే".

"శానా మంచోల్లు సార్ మీరు"

అబ్బో.. నీవు మంచివాడవంటరోయ్... అహ్హాహ్హా.. ఒక్క క్షణంలో ద్వైదీభావంతో ఆలోచించేవాడివి....... ఒక చిన్న మంచి పని చేయడానికి అంతస్సంఘర్షణ పడుతున్న వాడివి.... మంచివాడివా... అయినా మనం మనుషులం.....మన సుఖాల్ని వదులుకోమ్....అన్నీ శ్రీరంగనీతులే చెప్తాం... అయినా అనంతం సాక్షిగా మహా కవికి నిజం చెప్పే ధైర్యముంది........ మరి సామాన్యులకీ?.... దారి తప్పిన బాటసారికీ? .... చిమ్మ చీకటి కమ్ముకొస్తే ఎంతకష్టం.... ఎంతకష్టం...

రేయ్... రేయ్.... అటు చూడ్రా... హాస్పెటల్ ముందు.. శవాల టాక్సీడ్రైవర్లు చలిమంటేసుకున్నారు.. మనమూ పోదామా.... యీ చలిలో... వ్యవస్థలా అలుముకున్న

చీకటిలో..... హాస్పిటల్ కాంపౌండ్ గోడనాను కొని క్యూ కట్టి నిలబడ్డ శవాల టాక్సీలూ... గిరాకీలు కోసం రేయంతా వేచి వున్న డ్రైవర్లు... చలిమంటేసుకున్నారే... ఆ గుంపులో ఎంత మంది భగవాన్లుంటారో.... నేనూ చీకటి శవాల టాక్సీడ్రైవర్ గాడికి నిజం చెప్పే ధైర్య మెక్కడా?.... చలికి చలిమంటలూ... బతుకేమో చలి మంటల్లో... సమాజానికీ జనరల్ హాస్పిటల్కీ... రోగులకూ డాక్టర్లకీ... శవాలకూ యీ డ్రైవర్లకీ యేమిటో అవినాభావ సంబంధం..కాశీభట్ల వేణుగోపాల్ను అడగాలి.

"యెక్కండి సార్....శానా దూరం నడిస్తిరి"

యెక్కు... యెక్కువోయ్.... చలి... చలి అని గోలపెడుతున్నావ్ యెక్కు... గోల.... నాది కాదు నాయనా గోడలది.... గోల... నా నా రాతల రోతల్ని యెక్కించుకొని మోస్తున్న. నీకిరువైపులా నగరమంతా యెక్కడ చూస్తే అక్కడే... గ్రాఫిటీల గోల.... ప్రతి రాజకీయ నాయకుడ్నీ మోస్తూ.... ప్రతి నినాదాన్నీ ముందు దగా వెనుక దగా నీ కుడి ఎడమల గోడలమీద దగా దగా ప్రతి ధ్వనిస్తూ... మొన్న వున్నది.... నిన్న లేదు...నిన్న వున్నది... నేడుండదు....యీ రోజున్నది... రేపుండదు... తుడవడం రాయడం... మళ్ళీ తుడవడం... మళ్ళీ మళ్ళీ రాయడం.....గోడలు గోలపెడ్తూంటాయి.... రాతలూ, వాల్ పోస్టర్లూ వాటి మీద వూరేగుతుంటాయ్....రిక్షాలో నువ్ వూరేగినట్టు.... ఇక అపు.... ఎదురుగా చూడు....

ఆహా.... యెంతందమైన దృశ్యం.... చూడు... కె.సి.కెనాల్ నీళ్ళలో గట్టు వెంబడి వున్న లైట్ల వెలుగు పడి చీకట్లో యెట్లా మెరుస్తోందో! ...ఆటోలో పోయుంటే యీ సీన్ దొరికుండేదా.... ఆ స్పీడ్లో... చూసుండేవాడివా.....రిక్షావాడికి థ్యాంక్స్ చెప్పరా...... ఎన్నిలక్షలిచ్చి యీ అనుభూతిని పొందగలవురా... నిశ్చలంగా ప్రవహిస్తున్న నీటి పైన చిరుగాలి పిచ్చి గీతలు గీస్తుంటే.... వెలుగు కిరణాలు పిచ్చిగీతల్ని తుడవడానికి ప్రయత్నిస్తున్నట్లు చొచ్చుకుపోతూంటే.... చిరుగాలీ... చిరు వెలుగూ వొరుసుకొని.... నీళ్ళు గిలిగింతలతో తళుక్కున నవ్వుతూన్నట్లు... ఆహ్లాదంగా వుంది.... రిక్షావాణ్ణి కొంచెం ఆగమనరా బాబూ యింకాస్సేపు చూద్దాం... అరేరే... దాటిపోతున్నామే.....

"కౌసల్యా సుప్రజా రామా...."

ఎం.ఎస్.ఎస్. సుప్రభాతం.... "భూతాది సంసేవిత చరణం – భూత భౌతికా ప్రపంచ భరణం...." ఘంటశాల గాత్రం.... రెండూ కలగలసి విన్పించడం.... బాగుంది... యేమో అనుకున్నా.... రిక్షాలో రావడమే బాగుందే.... దృశ్యాలూ... గాత్రాలూ... డిక్ డిక్ డిక్ డిక్ నేపథ్యమూ.... బాగుంది .... చలి.... చలి బాగా... చంపేస్తా వుంది..... అయ్యో యేమిటీ... మెయిన్ రోడ్లో... మద్దూర్నగర్ వద్ద లైట్లు లేవు... చీకటి... చిమ్మ చీకటి... రోడ్డు రెండు వైపులా యిండ్లూ... చెట్లూ దట్టంగా..... వున్నందుకేమో... చీకటంటే చిక్కన చీకటి వర్ణణ విరాటపర్వంలోది... 'పెనుమిట్టిది పల్లంచిది'.. గుర్తుకొస్తుంది.... చిక్కని తిక్కన ఆలోచన అద్భుతం.... ఆలోచన...మనోలోచన.. విద్యుల్లతా విన్యాస యోచన.... ఒక్క క్షణంలో.... వేల యోజనాల దూరాన్ని మనసులో ప్రత్యక్షించే.... చాలన.... చీకటిలో తళుక్కున మెరిసే చాలన చీలికలు... ప్రహేళికలు సృష్టి పరిణామంలో మహోన్నత ఆవిష్కృతి... మనసు... ఆమెన్ !... చర్చి గంటలూ వున్నతమే... అమ్మయ్యా చర్చి దగ్గరకు వచ్చేసినాం... యింక వచ్చేసినట్లే... ఎట్లా ఆరిస్తున్నాం యింకొంచెం ముందుకు ఆ బ్రిడ్జి దాకా రమ్మందామా .

"సార్ సరిగ్గా చిల్లరివ్వండి నాకాడేమీ లేదు".

"ఇంకొంచెం ముందుకు ఆ బ్రిడ్జి దాకా రావయ్యా"

"ఆం .... బ్రిడ్జి కాడికా సార్ అయితే ఎనిమిదియ్యండి సార్"

"యేమయ్యా మొదటి బోణీ నేనే చేసాను... యీ కొంచెం రాలేవా మళ్ళా రెండ్రూపాయలు ఎక్కువ అడుగుతున్నావా"?

"ఏంది సార్...రెండ్రూపాయలు...టీ తాగితే అయిపోతాయి... యేదో బీదోళ్ళం మా కడుపు గొడతారా సార్"

"ఏమయ్యా అంత అన్యాయంగా మాట్లాడతావ్, అసలు ఆటోలో వచ్చుంటే యింత కన్నా తక్కువకే యింతకన్నా ముందే వచ్చుండే వాడ్ని, యేదో పోన్లే రిక్షావాడివని బోణీ చేస్తే....."

"ఆ బ్రిడ్జి దంకా రావల్ల కద్సార్... రెండ్రూపాయలే కదా... ఆటోవాడు పదడుగు తాడ్సార్..."

"పదెందుకయ్యా.....వేరే వాళ్ళు వచ్చే ఆటో మధ్యలో యెక్కితే మూడ్రూపాయలే కదా, నీ కళ్ళముందే రెండు ఆటోలు వచ్చా....యా దాంట్లోనే వొక దాంట్లో వస్తా వుంటి.....నీకు ఆరిచ్చి యింత ఆలస్యంగా.... ఈ చలిలో.... రావయ్యా అక్కడి దాకా "

"యెనిమిదియ్యాల్సిందేసార్"

"సరే పోవయ్యా నీకు న్యాయం లేదు. నువ్వాడ దాకా వచ్చి దింపినా, నేనింకా ముందుకు పోవాలి, నడవక తప్పదు నడిచే పోతాన్లే".

ఆరు రూపాయలు యివ్వక యెట్లా తప్పలా పొద్దున్నే రిక్షావాడితో యేంది రగడ... అయినా బీదవాల్లంటామే..వీళ్ళ దగ్గరా న్యాయం లేదే...ఆగు..ఆగునాయనా...పోనీ నీ దగ్గరుందా న్యాయం...వ్యాపారం వ్యాపారమే... C – క్యాంపు దాకానే ఆరుకు మాట్లాడినావు, మళ్ళా ముందుకు రమ్మంటే యెట్లా? ఎక్స్ట్రా పనికి ఎక్స్ట్రా కూలి యివ్వాల్సిందే కదా.....

నరేవాడికి కూలి కల్పించక పోయుంటే.... మనం ఆటోలో వచ్చుంటే? అలా అంటావా..... నువ్వు కాకపోతే యింకొకరు యెవరి దగ్గరైనా యీ లౌక్యమే వుపయోగిస్తాడు, అతడు.... నువ్వైనా అంతే....

అయినా రిక్షాలో రావడం వల్ల ఎంత మంచి దృశ్యాన్ని చూశాం..ఆ అనుభూతి వెలకట్టలేనిదే కదా..అన్నీ తెల్సి మళ్ళీ సంఘర్షణకు లోనవుతాం..నిజమే... స్వామిగారి అద్దం కథలో లాగా మనోదర్పణంలోనూ కుడులన్నీ ఎడమలే...మనోదర్పణమూ సామాజిక దర్పణానికీ ప్రతిబింబమే...ఎంత సంస్కారవంతులకైనా మానసికంగా నైనా యీ సంఘర్షణ తప్పదేమో..... మనకూ బయటి ప్రపంచానికీ... మనలో మనకీ... సంఘర్షణ... యీ భావ సంఘర్షణని మోస్తూ నిరంతరం వూరేగాల్సిందే.